క్లుప్తంగా

మా కడుపు కొట్టొద్దు



అదనపు కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న రోజా మహిళా ఐక్య సంఘం సభ్యులు

కర్నూలు (టౌన్) : రోజా వీధిలో నివసిస్తున్న పలువురు దళితులు పక్కనున్న తుంగభద్రనది వెంట మురుగునీటిలో గడ్డి పెంచి, తర్వాత విక్రయించి జీవనం సాగిస్తున్నారని రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత తెలిపారు. అయితే, ఇప్పుడు నది ఒడ్డు పక్కన రహదారి నిర్మాణ పనులు చేపడుతుండటంతో వారు జీవనాధారం కోల్పోవాల్సి వస్తుందన్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి ఎవరికి ఉపయోగం లేని ఈ రహదారి పనులను నిలిపివేయాలని కోరారు. ఈ అంశంపై నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఐక్య సంఘ సభ్యులు రాజు, రామేశ్వరమ్మ, దేవిక, రంగమ్మ, లలితమ్మ, బీసమ్మ, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల చట్టం పారదర్శకంగా ఉండాలి



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్) : త్వరలో ఉపాధ్యాయ బదిలీలు చేపడుతున్న తరుణంలో అందుకు తయారయ్యే యాక్ట్ (చట్టం) పారదర్శకంగా ఉండాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ కోరారు. మంగళవారం కర్నూలులో యూటీఎఫ్ గూడూరు, సి.బెళగల్ మండలాల కార్యవర్గ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ చట్టం అమలులో ఉపాధ్యాయులు, సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. ఐక్య ఉపాధ్యాయ పత్రికను ఉపాధ్యాయులు చదవడం వల్ల చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పాఠశాలలను యథావిధిగా ఉంచి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని, ప్రాథమిక విద్యను బలపరచాలని, వెనుకబడిన వర్గాలను, దళితులు నివసించే ప్రాంతాల్లోని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని, జీవో నెం.47ను అమలుపరచి తద్వారా ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని, పీఆర్‌సీ అమలుపరచాలని, ఐఆర్ 30 శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఏటీ తిమ్మన్న, గూడూరు, బెళగల్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంతారావు, షబ్బీర్, హనుమన్న, షఫి, హనుమంతు, కిషోర్, మల్లయ్య పాల్గొన్నారు.

కాల్వబుగ్గ దేవస్థానంలో అగ్నిప్రమాదం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో మంగళవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు.. దేవస్థానంలో భక్తులకు వంట చేసేందుకు పెంటాల్ వేశారు. ప్రతి ఏడాది శివరాత్రి పండుగ రోజున ఈ సత్రంలోనే భక్తులకు భోజనాలు వడ్డిస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అన్న వడ్డించేందుకు పెంటాల్ వేశారు. రాత్రి వీచిన గాలి తీవ్రతకు మంటలు వ్యాపించి అగ్ని ప్రమాదం సంభవించింది. ఆలయ అధికారులు వెంటనే అప్రమత్తమై స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు విఫల యత్నం చేశారు. అప్పటికే కుర్చీలు, పెంటాల్ మొత్తం కాలిపోయింది. అయితే, ఈ ప్రమాదం పక్కనే వున్న విద్యుత్ తీగల నుంచి షార్ట్‌సర్క్యూట్ వల్ల జరిగిందా లేక? లేక చెత్తకుండీల నుంచి నిప్పురవ్వలు ఎగిసి పడటం ద్వారా ప్రమాదం జరిగిందా? అనేది తెలియాల్సి ఉంది.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. అమ్మవారికి ఒడి బియ్యం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
దివాలా అర్జీ నెంబర్: 17/2025
ఎమ్.నిఖిల్ కుమార్ ..అర్జీదారు
-Vs-
శేఖర్ మరియు 15 మంది ..ప్రతివాదులు

జనరల్ నోటీసు

కర్నూలు జిల్లా కర్నూలు గ్రామ ప్రజలకు తెలియజేయడము ఏమనగా పై కేసు ఎమ్.నిఖిల్‌కుమార్ తండ్రి ఎమ్.వీరసుధాకర్ ఇ.నెం. 44/86-ఎ-1, వి.వి.ఆర్ నివాస్ ఫ్లాట్ నెంబరు:201, రాధాకృష్ణ ఆసుపత్రి దగ్గర కర్నూలు అనువారు తనను దివాలాదారుగా తీర్మానము చేయమని కోరుతూ పై కోర్టులో దివాలా అర్జీదాఖలు చేశారు. ఇందుపైన ఎవ్వరికైనను ఏటువంటి ఆక్షేపణలు ఉన్న తేది: 27-03-2025 ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరై తెలుపుకొనవలెను. లేని యెడల పరోక్షముగా విచారించి తీర్మానము చేయబడును.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

పి.వి.రమణారెడ్డి, B.Sc., B.Ed., B.L.
అడ్వకేటు, కర్నూలు.

శంభో శంకరా!

- మహాశివరాత్రికి ముస్తాబైన శైవ క్షేత్రాలు
- పరమేశ్వరుడి దర్శనం కోసం నేడు పోటెత్తనున్న భక్తులు
- ఇప్పటికే ఉత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధం
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయాల అధికారులు, కమిటీ సభ్యులు



సప్తగిరి కైలాసగిరి ఆలయంలో మరకత లింగం



రూపాల సంగమేశ్వరుడు



శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయం

కర్నూలు కల్చరల్: భక్త సులభుడైన పరమేశ్వరుడు ప్రాణ కోటి హితం కోసం హాలాహలాన్ని కూడా ఆనందంగా సేవించాడు. ఆ మహాదేవుని అర్చించి అభిషేకించి తరించే పర్వదినమే మహా శివరాత్రి. ఈ పుణ్య దినాన ఉపవాసం, జాగరణలే కాకుండా శంకరుని చరితామృత శ్రవణం, గుణగానం, పాదసేవనం పరమ పవిత్రం. నేడు మహా శివరాత్రిని పురస్కరించుకుని కర్నూలు నగరంలో సప్తగిరి కైలాసగిరి ఆలయం, ఓల్డ్‌సిటీ నగరేశ్వరాలయం, లలితా పీఠం, అశోక్‌నగర్, శ్రీరామనగర్, బుధవారపేటల్లోని శివాలయాలు, నెహ్రూనగర్ సాయీశ్వరాలయం, ఆరోరా నగర్ రాజరాజేశ్వరీ ఆల్యం, జిల్లా పరిషత్ శివాలయం, దేవనగర్‌లో సత్యనారాయణ స్వామి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే రంగురంగు విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలు, అరటి బోదెలు, టెంకాయ మట్టలతో ఆయా ఆలయాలను శోభాయమానంగా తీర్చిదిద్దారు. బుధవారం రాత్రి భక్తులు జాగరణ చేసేందుకు, లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

పుణ్యప్రదం..పంచేశ్వర క్షేత్ర దర్శనం

నగర శివారులో దక్షిణ దిక్కున దిన్నెదేవరపాడు గ్రామ పొలిమేరలోని జగన్నాథ గట్టుపై వెలసిన శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని ఏటా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. భక్తిశ్రద్ధలతో భోళా శంకరుడిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరతాయనే వారి నమ్మకం. రూపాల సంగమేశ్వ రాలయం కపిలేశ్వరం, సోమేశ్వరం, మల్లేశ్వరం, అమరేశ్వరమనే పంచేశ్వర క్షేత్రాల్లో ఇదొకటి. శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయ ఈఓ గుర్రెడ్డి, జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆలయాన్ని సందర్శించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా బందోబస్తు నిర్వహించాలని కర్నూలు డీఎస్పీ రమేష్‌ను ఆదేశించారు. దేవాలయం వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు శ్రీ రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్ష కార్యదర్శులు పులకుర్తి నరసింహారెడ్డి, సాధు శ్రీనివాసరెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, కోశాధికారి వాసుదేవయ్య తెలిపారు.

శివరాత్రి వేడుకలు ఇలా..

జగన్నాథ గట్టులోని శ్రీ ఉమా సమేత రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో 26వ తేదీ ఉదయం 5 నుంచి 9 గంటల వరకు పంచామృతాభిషేకం, 12 గంటల వరకు పాలాభిషేకం, రుద్రహోమం అనంతరం మధ్యాహ్నం 1 గంటకు స్వామివారికి అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

- సాయంత్రం 6 గంటలకు దిన్నెదేవరపాడు గ్రామస్తులతో ప్రభోత్సవం నిర్వహిస్తారు.
- రాత్రి 12 నుంచి 1 గంట వరకు లింగోద్భవ అభిషేకం, 27వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు శివపార్వతుల కల్యాణం, స్వామివారి ప్రాకార పల్లకీ సేవ కార్యక్రమాలు ఉంటాయి.
- భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథ, భజన, కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.
- 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు శివపార్వతుల రథోత్సవం నిర్వహిస్తారు.
- 26వ తేదీ ఉదయం 5 నుంచి 27వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఏపీ ఎస్‌ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. గడియారం ఆస్పత్రి, కొత్త బస్టాండ్, రాజ్‌విహార్, సీక్యాంప్, వెంకటరమణ కాలనీ, బళ్లారి చౌరస్తా, కల్లూరు, క్రిష్ణానగర్, దిన్నెదేవరపాడు మీదుగా జగన్నాథ గట్టుపైకి బస్సుల సౌకర్యం ఉంటుంది.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీల్లో రాణించాలి



క్రీడాకారులతో ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు

కర్నూలు (టౌన్): ఈనెల 27 వ తేదీ నుంచి వచ్చే నెల 3 వరకు తమిళనాడులోని సేలం పెరియార్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న దక్షిణ మండల అంతర్ విశ్వవిద్యాలయాల హ్యాండ్ బాల్ పురుషుల పోటీల్లో ప్రతిభ చాటాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ వెంకట బసవ రావు అన్నారు. మంగళవారం స్థానిక రాయలసీమ యూ నివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్వర్యంలో హ్యాండ్ బాల్ జట్టు క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. రాయలసీమ యూనివర్సిటీ ఫిజిక ల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.వి. కిషోర్ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీల్లో పాల్గొనే జట్టు ను ప్రకటించారు. జట్టులో అభినయ్, రోహిత్, బాలు, హర్షవర్ధన్, రామకృష్ణ, సురేంద్ర, రాజు, సా హిల్ రియాజ్, షేక్షా వలీ, వాహిద్, జగదీష్, రహంతుల్లా, మహేష్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో యూ నివర్సిటీ జట్టు కోచ్ ప్రభాకర్, దుర్గ పాల్గొన్నారు.

వ్యాధుల గుర్తింపు సర్వే

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను సేకరిస్తున్నారు. ఎన్‌సీడీ, సీడీ సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు ఇంటింటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి రెగ్యులర్‌గా మందులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

పూలు, పండ్ల ధరలకు రెక్కలు!

- బయట కంటే రైతుబజారులోనే అధిక రేట్లు
- రెండు, మూడు రోజుల క్రితంతో పోలిస్తే 50 శాతం వరకు పెరిగిన ధైనం



రైతు బజార్ ప్రాంతంలో పూల అమ్మకాలు

కర్నూలు(అగ్రికల్చర్): శివరాత్రి పర్వదినం నేపథ్యంలో పూలు, పండ్ల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధానంగా పూల ధరలు 50 శాతం వరకు పెరగడంతో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాలతో పోలిస్తే సీ.క్యాంపు రైతుబజారులోని పూలు, పండ్ల ధరలను వ్యాపారులు భారీగా పెంచేశారు. పూల ధరలపై రైతుబజారు అధికారులు, సిబ్బందికి నియంత్రణ ఉండదు. బోర్డులపై పూల ధరలు రాయరు. దీంతో వ్యాపారులు ఏ ధర చెబితే ఆ ధరకు కొనక తప్పదు. రెండు, మూడు రోజుల క్రితం వరకు బంతిపూలు కిలో ధర రూ.50, గులాబీల ధర రూ.150, చామంతి ధర రూ.100, మల్లెలు పావు కిలో ధర రూ.150 వరకు ఉన్నాయి. శివరాత్రి సందర్భంగా ధర రెట్టింపు చేశారు. బంతి పూలు రూ.100 ఆపై ధరకు విక్రయిస్తుండగా గులాబీల ధర రూ.220, చామంతుల ధర రూ.150, మల్లెలు పావు కిలో ధర రూ.220 వరకు పెంచి విక్రయించారు. పండ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. పండ్ల ధరలను బోర్డుపై రాస్తున్నప్పటికి వాటిని వ్యాపారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బోర్డుపై రాస్తున్న పండ్ల ధరలు బయటి మార్కెట్ కంటే ఎక్కువగా ఉంటున్నాయనే విమర్శలు ఉన్నాయి. మామూలుగా అయితే రైతుబజారులో ధరలు కాస్త తక్కువగా ఉండాలి. కాని ఇక్కడ ఎక్కువగా ఉంటుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వ్యాపారులు బోర్డుపై రాసిన ధరలను మరింత పెంచి అమ్ముతుండటం గమనార్హం. యాపిల్ కిలో ధర రూ.200, ద్రాక్ష రూ.100, చీని రూ.80, సపోట రూ.80, జామ రూ.50, కమల రూ.100, దానిమ్మ రూ.220 బోర్డుపై రాసినప్పటికి ఈ ధరలను వ్యాపారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. 10 నుంచి 20 శాతం అధికానికి విక్రయించారు. కర్బూజ, కళింగర పండ్ల ధరలను కూడా భారీగానే పెంచేశారు. జాయింట్ కలెక్టర్, మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రత్యేక చొరువ తీసుకొని ధరలను కట్టడి చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

పని ప్రదేశాల్లో షీ బాక్స్‌లు ఏర్పాటు చేయించాలి

- కలెక్టర్ పి.రంజిత్ బాషాను కోరిన ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం

కర్నూలు (సెంట్రల్) : పనిచేసే ప్రదేశాల్లో మహిళా ఉద్యోగుల భద్రత కోసం షీ బాక్సులు ఏర్పాటు చేయించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం కలెక్టర్ పి.రంజిత్ బాషాను కోరింది. మంగళవారం సాయంత్రం ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ కె.వై.కృష్ణ ఆధ్వర్యంలో మహిళా విభాగం నేతలు కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా లైంగిక వేధింపులను అరికట్టడానికి ప్రభుత్వ కార్యాలయాల్లో షీ బాక్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఏపీజేఏసీ మహిళా విభాగం అధ్యక్షురాలు సైరాబాను అమరావతి మహిళా విభాగం అభ్యర్థనను సమర్పించింది. అలాగే మార్చి 8వ తేదీన జరిగే మహిళా దినోత్సవం పాల్గొనాలని కలెక్టర్‌ను ఆమె ఆహ్వానించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీరాజు, ఏపీజేఏసీ అమరావతి క్లాస్ 4 ఉద్యోగులు మద్దిలేటి, డ్రైవర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

శివరాత్రి వేడుకలు ప్రత్యక్ష ప్రసారం

కర్నూలు (హాస్పిటల్) : ఇషా ఫౌండేషన్ కర్నూలు కేంద్రం ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ప్రకటించారు. కొయంబత్తూరులోని ఇషా యోగా సెంటర్ నుంచి ఈ వేడుకలను కర్నూలులోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న ఎస్వీ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రత్యక్ష ప్రసారం కొనసాగుతుందన్నారు. భక్తులు, ఆధ్యాత్మిక సాధకులు కొయంబత్తూరు వెళ్లలేని వారు ఈ ప్రత్యక్ష ప్రసారాన్ని చూసి తరించాలన్నారు. ఈ వేడుకల్లో సద్గురుతో మెడిటేషన్, సంగీత ప్రదర్శనలు, సంప్రదాయ కళారూపాలు తదితర అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ పవిత్ర రాత్రిని ఆధ్యాత్మిక భావంతో నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనన్నారు.

షూటింగ్ బాల్ పోటీలకు అబ్జర్వర్‌గా పరశురాముడు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 1 వ తేదీ నుంచి 3 వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ పట్టణంలో నిర్వహించే 4 వ సౌత్‌జోన్ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు అబ్జర్వర్‌గా పరశురాముడు నియమితులయ్యారు. ఏపీ షూటింగ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శిగా పనిచేసే ఈయనకు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి జీత్ రాజ్ తోమర్ నుంచి నియామక ఉత్తర్వులు అందాయి. ఈ విషయాన్ని పరశురాముడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బడా సుబ్బిరెడ్డి మృతి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): రైతు సంఘం రాష్ట ఉపాధ్యక్షుడు, సత్యసాయి జిల్లా రైతు సంఘం కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి(68) మృతి రైతు ఉద్యమానికి తీరని లోటని ఆ సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం ఆయన అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతి చెందారన్నారు. ఈ నేపథ్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ట్రాక్టర్ల సీజ్

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో ఎర్రమట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఒక జేసీబీని సీజ్ చేసినట్లు కోడుమూరు సీఐ తబ్రేజ్ మంగళవారం తెలిపారు. అనుమతుల్లేకుండా ఎవ్వరైనా వ్యక్తులు ఎర్రమట్టి, ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తామని సీఐ హెచ్చరికలు జారీ చేశారు.

రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలి



వీసీని అభినందిస్తున్న వైఎస్సార్ స్టూడెంట్స్ యూనియన్ నాయకులు

కర్నూలు (హాస్పిటల్): రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి సహకరించాలని నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వీసీ డాక్టర్ వెంకట బసవరావుకు వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ కర్నూలు జిల్లా అధ్యక్షుడు రెడ్డిపోగు ప్రశాంతి, ఉపాధ్యక్షులు మణిరెడ్డి కోరారు. ఈ మేరకు వారు మంగళవారం వీసీని మర్యాదపూర్వకంగా కలసి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ యూనివర్సిటీలో టెక్నికల్ కోర్సులు ప్రవేశపెట్టాలని, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా యూనివర్సిటీని తీర్చిదిద్దాలని, కొత్త కోర్సులు ప్రవేశపెట్టి వర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఇందుకు వీసీ మాట్లాడుతూ అందరి సహకారంతో కొత్త కోర్సులు ప్రవేశపెట్టి వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు మణిదీప్ రెడ్డి, రాజేష్, సంతోష్, రాయలసీమ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు అఖిల్, చంటి, రాజవర్ధన్, మహమ్మద్, హుసేన్ అలీ, నిఖిల్, కిరణ్ తదితరులు ఉన్నారు.

- రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణకుమార్ కోరారు. మంగళవారం వారు యూనివర్సిటీ వీసీ వెంకటబసవరావును కలసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు దామోదర్, మద్దూరు సూర్యారెడ్డి, పీవైఎల్ నాయకులు ఇమాం బాషా పాల్గొన్నారు.

సారా తయారీకి స్వస్తి చెప్పండి



సారా తయారీని మానుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ ఎస్ఐ రెహనా బేగం

కర్నూలు: సారా తయారీ, రవాణా, విక్రయాలను మానుకుని ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా గౌరవ ప్రదమైన జీవనం గడపాలని ఎక్సైజ్ ఎస్ఐ రెహనా బేగం సూచించారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ శివారు ప్రాంతాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు నాటుసారా బట్టీలను ధ్వంసం చేశారు. అక్కడ 800 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే బెల్లం ఊట, 15 లీటర్ల నాటుసారాను నేలపాలు చేశారు. అలాగే, మునగాలపాడు గ్రామంలో కూడా సారా విక్రయాలపై తనిఖీలు నిర్వహించి గ్రామ సభ ఏర్పాటు చేసి నాటుసారా నిర్మూలన ఆవశ్యకతను వివరించారు. కర్నూలు బంగారుపేటలోని కేసీ కెనాల్ గట్టుపై ఉన్న సారా బట్టీలను కూడా ధ్వంసం చేసి సారా విక్రయిస్తున్న నీలిషకారి గౌరీని అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై కేసు నమోదు చేసి 15 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు.ఈ తనిఖీల్లో ఎస్ఐ నవీన్‌తో పాటు ఎస్‌టీఎఫ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



ఫెన్సింగ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్) : క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, అప్పుడే జీవితంలో ఎదిగే అవకాశం ఉంటుందని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్ శ్రీధర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ ఒలింపిక్ క్రీడ ఫెన్సింగ్‌ను కర్నూలు క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఫెన్సింగ్ క్రీడలో డిజిటల్ టెక్నాలజీ మిళితమైందన్నారు. ఈ క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. నగరంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానన్నారు.

క్రీడలకు సమయం కేటాయించాలి

- చిన్మయ విద్యా సంస్థలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



ఖో-ఖో పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న

కర్నూలు (టౌన్): విద్యార్థులు ప్రతి రోజు రెండు గంటలు క్రీడలకు సమయం కేటాయించాలని జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న అన్నారు. మంగళవారం స్థానిక సంకల్‌బాగ్‌లోని చిన్మయ విద్యా సంస్థలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఖో-ఖో పోటీలను పాఠశాల అధినేత టీజీ శివరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు చదువుల్లోనూ రాణిస్తారన్నారు. పాఠశాలలో అకాడమిక్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో చిన్మయ, ఎల్‌వీఎస్ ఓబులాపురం, వీకేఎం లీడర్స్ పాఠశాలలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణదుర్గం స్వర్ణలత, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మురుగు హంద్రీలో కలవకుండా చర్యలు తీసుకోండి

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి, అశోకా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వచ్చే మురుగు నీరు హంద్రీలో కలవకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లాకార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. మురుగు నీరు కలుస్తుండటంతో హంద్రీలోని నీరు కలుషితమమవుతుందని, దీనిని దూపాడువాసులు తాగి ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఆయా విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కృష్ణ, నాయకులు మధు పాల్గొన్నారు.

రోగులను మర్యాదగా పలకరించాలి



హాజరైన హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన వచ్చిన రోగులను మర్యాదగా పలకరించి సేవలందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. మంగళవారం ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో అన్ని విభాగాధిపతులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్‌టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ) అమలు సరిగ్గా ఉండేటట్లు చూసుకోవాలని ఆదేశించారు. ఈ-హాస్పిటల్ అమలులో భాగంగా పలు విభాగాల్లో ఓపీ, డిశ్చార్జ్ మాడ్యూల్ మెరుగు పరుచుకోవాలన్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్)లోని ఆరు అంశాలపై సమీక్ష నిర్వహించి తగు సూచనలు అందజేశారు. ముఖ్యంగా వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించాలని సూచించారు. నూతనంగా వచ్చే హౌస్ సర్జన్లకు ఎఫ్ఆర్ఎస్, డ్రెస్ కోడ్, ఐడీ కార్డు, సక్రమంగా హాజరు ఉండేటట్లు చూసుకోవాలని హెచ్‌ఓడీలకు చెప్పారు. అలాగే రోగులకు వైద్యపరీక్షలు, మందులు బయటకు రాసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పలు విభాగాల్లో ఏసీల మరమ్మతులను పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో ఓపీ విభాగాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మందుల కొరత లేదు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ, అత్యవసర విభాగాల్లో ఎలాంటి మందుల కొరత లేదని సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాజాగా ఆసుపత్రిలో మందుల కొరతపై ఆరా తీశామని, ముఖ్యంగా క్యాజువాలిటీ, అత్యవసర విభాగాల్లో మందుల గురించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఎక్కడా మందుల కొరత ఉన్నట్లు తన దృష్టికి రాలేదన్నారు. ఎమర్జెన్సీ మెడిసిన్ కోసం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నామన్నారు. రోగులకు అవసరమైన కొన్ని మందులు లేకపోతే స్థానికంగా కొనుగోలు చేసి ఇస్తున్నామని తెలిపారు. పీఎంబీజేకే ద్వారా, లోకల్ ఏజెన్సీల నుంచి అన్ని అత్యవసర మందులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. అత్యవసర విభాగాల్లో రోగులకు అవసరమైన స్ట్రెచర్లు, వీల్‌చైర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. న్యూ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో వైద్యపరీక్షల కోసం హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిలో మందులు ఎవ్వరికైనా వైద్యులు బయటకు రాస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోగులకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.